


# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## నాలాగా ఎందరో!

"**ఎన్నేళ్ళయిందో మనం కలుసుకుని**. ఇరవైఏళ్ళవలేదు?" హిమ తడికళ్ళతో అడిగింది.

"అవును. సుజీ పెళ్ళిలో కలిసామనుకుంటా చివరిసారి" రేణు చెప్పింది.

"సుజీ పెళ్ళికి నేను రాలేదు. నేను మిమ్మల్ని కలిసి ఇంకా చాలా ఏళ్ళయింది" మీనా అడ్డుపడింది.

"నా పెళ్ళయి ఇరవైమూడేళ్ళయింది" సుజిత నవ్వింది.

నలభైల్లోని ఆ ఐదుగురు యువతులు ఒకేసారి పుట్టింటికి రావడంవల్ల ఆ కలయిక సాధ్యమైంది.

కాఫీ గ్లాసులతో వచ్చిన కరుణ అందరికీ వాటిని అందించి పిట్టగోడకి చేరగిలబడింది.

"ఎలా ఉన్నారు అమ్మాయిలూ. అంతా కుశలమేనా?" కరుణ నవ్వుతూ అడిగింది.

"ఆహా! నువ్వొక్కదానివే కొంచెం నాజూగ్గా ఉన్నావు. మేమంతా లావయ్యాం" మీనా తన చేతులవంక చూసుకుంటూ చెప్పింది.

"అది సెలబ్రిటీ కదా. పర్సనల్ ట్రైనర్ ఉన్నాడేమో. డైటీషియన్ కూడా ఉన్నాడా?" సుజిత ఆసక్తిగా అడిగింది.

కరుణ పెద్దగా నవ్వింది. తర్వాత చెప్పింది.

"సెలబ్రిటీ నేను కాదు. వికాస్, నేను హాయిగా ఇష్టమొచ్చినవి తింటూంటా. కాకపోతే రోజుకో గంట వర్కవుట్స్ చేస్తా అంతే"

"నువ్వెప్పుడైనా చిరంజీవిని చూసావుటే?" రేణు ఆసక్తిగా అడిగింది.

"చాలాసార్లు చూసాను. నన్ను చూస్తే ఆయన గుర్తుపడతారు" కరుణ చిరు గర్వంతో చెప్పింది.

హిమ లేచినుంచుని దూరంగా కనపడే గుడి గోపురాన్ని చూస్తూ చెప్పింది.

"ధ్వజస్థంభం ప్రతిష్ట పుణ్యమా అని ఆడపిల్లలు పుట్టింటికి రావాలనే సెంటిమెంట్‌తో కలిసాం. లేకపోతే ఈ అవకాశం వచ్చేదేకాదు."

"అవును. నేను ఎప్పుడు మన ఊరు వచ్చినా మీ అందరిళ్ళకీ వెళ్ళి అడుగుతాను. మీరొచ్చారా అని" మీనా చెప్పింది.

"ఇప్పుడు కలిసాం కదా. మనకొక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసుకుందాం. అప్పుడు కలిసినా కలవకపోయినా టచ్‌లో ఉంటాం" రేణు సూచించింది.

కొద్దిసేపు కబుర్లు చెప్పుకున్నాక సుజిత చెప్పింది.

"అమ్మాయిలూ ఇప్పుడు మనం ఒక డిబేట్ చేద్దాం. అది కరెక్ట్ పదం కాదేమో. ఒక టాపిక్ మీద మాట్లాడదాం. అబద్ధాలు చెప్పకుండా ఫ్రాంక్‌గా మాట్లాడాలి. ఓకేనా?"

"కొంపదీసి నా ప్రేమ కలాపాలు అడగవుకదా?" మీనా సందేహంగా అడిగింది.

"మాకు తెలీకపోతే కదా!"

అంతా నవ్వారు. పరిసరాల ప్రభావం, చుట్టుపక్కల ఉన్న మనుషుల ప్రభావం వల్ల చిన్న విషయాలకే నవ్వొస్తూండడం సహజం కాబట్టి వాళ్ళు నిమిషానికోసారి నవ్వుతూనే ఉన్నారు.

"విషయానికి వద్దాం. మనందరికీ పెళ్ళిళ్ళయ్యాయి. కరుణ తప్ప అందరం ఉద్యోగాలు చేస్తున్నాం. జీవితంలో సెటిలైనట్లే. ఇప్పుడు మీరంతా నేను అడిగిన ప్రశ్నకి అబద్ధమాడకుండా అతిశయోక్తులు లేకుండా జవాబు చెప్పాలి. సరేనా?" సుజిత వాళ్ళవంక చూస్తూ అడిగింది.

"ఏం చెప్పాలి?"

"మీరు మీ భర్తని ఎప్పుడైనా మోసం చేసారా? నేను అక్రమ సంబంధాల గురించి అడగడంలేదు. అది మీ విజ్ఞతకి సంబంధించిన పూర్తి వ్యక్తిగత విషయం. సో మన దైనందిన జీవితంలో మన భర్తలని మోసం చేసామా? చేస్తున్నామా? అన్నది నా ప్రశ్న" సుజిత చెప్పడం ఆపింది.

ఓ నిమిషం అక్కడంతా నిశ్శబ్దం. తర్వాత మీనా గొంతు సవరించుకుని చెప్పింది.

"నువ్వు చెప్పింది నాకర్థమైంది. యస్. నేను మా వారిని మోసం చేస్తున్నాను. మీకు తెలుసుకదా. నాకు నగలంటే పిచ్చి. ఆఫీస్‌కి కూడా చిన్న చిన్న ఆభరణాలు వేసుకెళ్తాను. మావారికి బంగారం అంటే అలర్జీ. వాళ్ళమ్మ బంగారం అంటూ వాళ్ళ నాన్నని పీక్కుతినేదట. తండ్రి ఆర్థిక బాధలతో కొనలేకపోతే ఆవిడ సాధించి చంపేదిట. అందుకని అతను నాకు

ముందే చెప్పాడు. గోల్డ్‌మీద ఇన్వెస్ట్ చేయకు అని. నా జీతమెంతో కూడా తనకి తెలియదు కాబట్టి నేను నగలు కొనుక్కుని మా అమ్మ వాళ్ళు కొనిచ్చారనో, రోల్డ్‌గోల్డ్ అనో చెప్తూంటాను. తను నమ్మేస్తాడు. ఈ మోసపు బతుకు నిజానికి నాకు నచ్చడంలేదు. నెమ్మదిగా నా వ్యామోహాన్ని తగ్గించుకుందామనుకుంటున్నా. ఈ సంవత్సరం ఇంతదాకా ఏమీ కొనలేదు."

"నాది నీలాంటి కథే, కాకపోతే ఇక్కడ కొనడంలేదు. ఇవ్వడమే. నెలకి పదివేలు అమ్మకి పంపిస్తాను. మావారికి తెలిస్తే ఎంత గొడవ అవుతుందో తెలుసు నాకు. కాని భగవంతుడి దయవల్ల ఇంతదాకా బయటపడలేదు. ఏకైక సంతానాన్ని. మరి వాళ్ళకి సహాయం చేయకపోతే ఎలా? రైతుల కష్టాల గురించి పేపర్లలో చదివి బాధపడటమేకాని మా వారు మామగారికి సాయం చేద్దామనుకోరు. నామీద సర్వహక్కులు తనవే కాబట్టి నా సంపాదన కూడా తనదే అనుకుంటారు" రేణు చెప్పింది.

"మీ ఇద్దరు చెప్పింది ఆర్థిక అంశాలు నాది మరో సమస్య. మావారు మూర్తీభవించిన పురుషాహంకారి. తప్పు చేసినా ఒప్పుకోరు. నామీదకి తోసేస్తారు. నేనంటే ప్రేమేకాని తనకి ఇష్టంలేని పనిచేస్తే కనీసం నెలరోజులు పలకరు. నాకో విచిత్ర సమస్య వచ్చింది" హిమ ఓ క్షణం ఆగింది.

అంతా ఆమెవంక ఆసక్తిగా చూసారు.

"పెళ్ళయిన మూడేళ్ళ తర్వాత అంతా పిల్లల గురించి అడగడం మొదలుపెట్టారు. ఇద్దరం కొద్దిగా భయపడ్డాం అప్పటిదాకా సంతానం గురించి మేం సీరియస్‌గా ఆలోచించలేదు. వెంటనే డాక్టర్‌ని కలిసాం. లోపం మావారిలో ఉంది. అది తెలిస్తే తను పిచ్చివాడు కాడు. శాడిస్ట్ అవుతాడు, అతని మనస్థత్వం నాకు బాగా తెలుసు. లోపం నాలో ఉందని చెపితే తక్షణం నాకు విడాకులిచ్చి రెండో పెళ్ళి చేసుకుంటాడు. దాంతో డాక్టర్ని పర్సనల్‌గా కలిసి రిక్వెస్ట్ చేసాను. ఆవిడ మా ఇద్దరిలో ఏ లోపంలేదని, కొందరికి పిల్లలు ఆలస్యంగా పుడతారని చెప్పింది. ఎవరినైనా పెంచుకుందామంటే ఒప్పుకోడు. మాకు పిల్లలు పుట్టరని నాకు తెలుసు. అతని ఇగోకి దెబ్బతగలకుండా నేను చెప్పించిన అబద్ధానికి ఇన్నేళ్ళుగా కట్టుబడి ఉన్నాను. ఇంట్లో పిల్లలు లేకపోవడం వల్ల ఎవరికి వాళ్ళు ఐలాండ్స్‌లా బతికేస్తున్నాం" హిమ దిగులుగా చెప్పింది.

"అయ్యో" అని అంతా కరుణ వంక చూసారు.

"వికాస్‌ది నాది లవ్‌మారేజ్ అని మీకు తెలుసు. అప్పట్లో టి.విలో చిన్న చిన్న వేషాలు వేసేవాడు. స్థిరత్వం లేని వాడని నాన్న మా పెళ్ళికి ఒప్పుకోలేదు. మేం రిజిస్టర్డ్ మేరేజ్ చేసుకున్నాం. ఆ తర్వత వికాస్ కష్టపడి ప్రయత్నించి సినిమాల్లోకి వచ్చాడు. హీరో ఫ్రెండ్స్‌లో ఒకడిగా, లేదా విలన్ కొడుకుగా వేషాలు వేసి, కామెడీ టైమింగ్ వల్ల కొంచెం పాపులర్ అయ్యాడు. కారు, ఇల్లుకొనుక్కున్నాం. పిల్లలు పుట్టాక పేరెంట్స్ కూడా వచ్చారు. కాని వికాస్ ఆ అవమానాన్ని మర్చిపోలేదు. వాళ్ళు ఇంటికి వస్తే పలకరించడు. నన్ను పుట్టింటికి పంపడు.

నన్ను ఎంతో ప్రేమించే వికాస్ ఈ ఒక్క విషయంలో మొండిగా ఉన్నాడు. అందుకని అతను విదేశాలకి షూటింగ్స్‌కి వెళ్ళినప్పుడే మన ఊరు వస్తాను. ఇండియాలో అవుట్‌డోర్ షూటింగ్స్‌కి నన్ను తీసుకెళ్తాడు. ఈ ఒక్క సందర్భంతోనే – గుళ్ళో ధ్వజస్థంభం ప్రతిష్ట, ఆడపిల్లలు వెళ్ళాలట – అని నచ్చచెప్పి రైట్ రాయల్‌గా వచ్చాను. ఒక్కోసారి ఈ దొంగ బతుకు బాధగా ఉంటుంది. విసుగ్గా ఉంటుంది. కాని నేను నిస్సహాయురాలిని" కరుణ నిట్టూర్చింది.

సుజిత చేతులోని సెల్‌ఫోన్ వంక చూస్తూ చెప్పింది.

"ఓ సినిమాలో విలన్ 'ఎందుకురా మమ్మల్ని దొంగలుగా చేస్తారు. ఎందుకురా మమ్మల్ని హంతకులుగా చేస్తారు' అని ఆక్రోశిస్తాడు. మనదీ అలాంటి ఆక్రోశమే. వాళ్ళ సహకారం ఉంటే మనకీ అబద్ధాల బతుకు ఉండేదికాదు. సరే. ఇక నా గురించి చెప్తాను....

నాదికూడా లవ్‌మేరేజ్. కాకపోతే రెండువైపులవారూ అయిష్టంగా పెళ్ళిచేసారు. ఇరవైమూడేళ్ళ క్రితం. ఆ యవ్వనపు వేడిలో నేను శశాంక్‌ని పెళ్ళిచేసుకున్నాను. పెళ్ళయ్యాక, కలసి ఒకే ఇంట్లో కాపురం చేస్తున్నప్పుడు అసలు శశాంక్‌ని చూశాను. అప్పటికే ఆలస్యమైపోయింది. లవ్‌మేరేజ్. ఎవరి అండా ఉండదు. నా చావు నేను చావల్సిందే. అతనిలోని లోపాల గురించి ఎవరికీ చెప్పలేము చెపితే నువ్వే ఏరికోరి చేసుకున్నావుగా అని వెటకారం చేస్తారని భయం. రోజూ ఆఫీస్‌కి వెళ్ళి, ఇంటికి వస్తూంటే కాళ్ళు మొరాయిస్తాయి. తప్పదు. పేరెంట్స్‌ని రెండోసారి అవమానాలపాలు చేయలేను. అలాగే ఇద్దరు పిల్లలు పుట్టారు. అతని మనసులో ఏముందోకాని తనకి ఇబ్బంది కలగనంతవరకూ బానే వుంటాడు. నేను కూడా తనని ప్రేమిస్తున్నానని మభ్యపెట్టి, మోసంతో జీవిస్తున్నాను. ఇరవైమూడేళ్ళుగా ఆ మనిషికి నేను రోజూ నిద్రపోయేప్పుడు ఐ లవ్‌యు చెప్తాను – నటిస్తున్నాను.

ఈ మధ్య నాన్నపోయారు. అమ్మ తర్వాత ఈ మోసపు బతుక్కి ఫుల్‌స్టాప్ పెడదామనుకుంటున్నాను. భర్తని మోసం చేసేది కేవలం నేనేనా? నాలా ఇంకొందరైనా ఉన్నారా అని ఈ ప్రశ్న అడిగాను. ఇప్పటి అమ్మాయిలు గయ్యాళివాళ్ళు. అబ్బాయిలు మంచివాళ్ళు అని అంటూంటారు. కాని మన ఐదుగురిలో ఎవరం మనవాళ్ళతో నిజాయితీగా లేం. లోపం మన ఆలోచనల్లో ఉందో, మన భర్తల్లో ఉందో తెలీడంలేదు" సుజిత చిన్నగా నిట్టూర్చింది.

"నాది వ్యామోహం. మీలాంటి కష్టాలు నాకు లేవు. ఇంటికి వెళ్ళాక మావారితో నిజాయితీగా ఉంటాను. కాకపోతే జరిగింది మాత్రం చెప్పను. చెపితే అతను ఎప్పటికీ నన్ను నమ్మడు" మీనా చెప్పింది.

"మా సమస్యలకి కాలమే పరిష్కారం" రేణు దీనంగా నవ్వింది.

సూర్యుడు దేవాలయం వెనక్కి వెళ్ళిపోయాడు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments